సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం ౹ 13 ౹ జూలై ౹ 2025



ఎక్కడికక్కడే సేకరణ.. అమ్మకం

పాల సేకరణ, విక్రయాలు మరింత పెంచాలని రాష్ట్ర పాడి పరిశ్రమ(విజయ డెయిరీ) నిర్ణయం తీసుకుంది. 8లో



ఓసీ విస్తరణ వైపు అడుగులు

గ్రామసభల ఆమోదంతో సింగరేణి మణుగూరు ఓసీ విస్తరణపై అధికారులు, కార్మికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం

34° / 25°

జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. వాతావరణం చల్లగా ఉంటుంది

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి దేవస్థానంలోని మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన పూజలు చేశారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళ తాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. వారాంతపు సెలవు దినాలు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

నిలిచిపోయిన మిషన్ భగీరథ తాగునీటి సరఫరా

పాల్వంచరూరల్: జిల్లావ్యాప్తంగా శనివారం మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడ్డారు. మండల పరిధిలోని తోగ్గూడెం వద్ద ఉన్న భగీరథ నీటిశుద్ధి కేంద్రంలోకి ఇటీవల కురిసిన వర్షాలతో బురద నీరు చేరింది. దీంతో అధికారులు తాగునీటి సరఫరాను నిలిపివేసి శుద్ధి కేంద్రాన్ని శుభ్రం చేశారు. ఆదివారం నుంచి తాగునీటిని సరఫరా చేస్తామని డీఈఈ సాయి తెలిపారు.

రాక్ క్లైంబింగ్‌లో ప్రతిభ



విద్యార్థులతో ఉపాధ్యాయులు

దుమ్ముగూడెం: మండలంలోని ఏకలవ్య పాఠశాల విద్యార్థులు నల్లగొండ జిల్లా భువనగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి రాక్ క్లైంబింగ్ పోటీల్లో రాణించారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ విజేందర్‌సింగ్, వైస్ ప్రిన్సిపాల్ నీరజ్‌యాదవ్‌లు శనివారం వివరాలు వెల్లడించారు. 12 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, ఏడుగురు ప్రతిభ చూపారు. విజేతలను ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ అభినందించారు.

భక్తరామదాసు ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదల



మోటార్‌కు పూజలు నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి రమేష్

కూసుమంచి: మండలంలోని ఎర్రగడ్డ తండా వద్ద భక్తరామదాసు ప్రాజెక్టు నుంచి సాగు అవసరాలకు అధికారులు శనివారం నీటిని విడుదల చేశారు. పాలేరు నియోజకవర్గ ప్రత్యేకాధి కారి రమేష్ పూజలు నిర్వహించగా, ప్రాజెక్టు డీఈఈ రమేష్‌రెడ్డి మోటార్ స్విచాన్ చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్, నేలకొండపల్లి మండలాల్లోని ఆయకట్టుతో పాటు చెరువులకు నీరు చేరుతుందని డీఈఈ తెలిపారు. మెట్ట పంటలు, వరి సాగుకు తొలుత పదిరోజులు నీరు సరఫరా చేస్తామని, ఈలోగా పాలేరు రిజర్వాయర్‌కు సాగర్ జలాలు చేరాక చెరువులను పూర్తిస్థాయిలో నింపుతామని వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ముందస్తుగా మేల్కొనేదెలా..?



రామాలయాన్ని చుట్టుముట్టిన వరద నీరు(ఫైల్)

40 ఏళ్ల క్రితం రూపొందించిన ఫ్లడ్ మ్యానువలే అనుసరణ

- 2022 వరదల తర్వాత నుంచి ముంపు బాధితుల్లో ఆందోళన
- పోలవరం ప్రాజెక్ట్‌తో ఏటేటా పెరుగుతున్న ముంపు తీవ్రత
- ప్రస్తుత పరిస్థితికి తగినట్టు మ్యానువల్ ఆధునికీకరణ తప్పనిసరి



గోదావరి స్నానఘట్టాల వద్ద వరద ఉధృతి(ఫైల్)

భద్రాచలం: ఏటా వర్షాకాలంలో భద్రాచలం ఏజెన్సీ ప్రజలకు గోదావరి వరదలు వణుకు పుట్టిస్తున్నాయి. జనావాసాలు, పంట చేలు నీటమునుగుతున్నాయి. వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన ముందస్తు ప్రణాళికకు సంబంధించి అధికారులు పాత ఫ్లడ్ మ్యానువల్‌నే అనుసరిస్తున్నారు. మరోవైపు పోలవరం ప్రాజెక్ట్‌తో ముంపు ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో వరద సమస్యలను ఎదుర్కొనేందుకు ఫ్లడ్ మ్యానువల్‌ను ఆధునికీకరించాల్సి ఉంది.

1984లో రూపకల్పన..

భద్రాచలం ఏజెన్సీని ఏటా గోదావరి వరదలు ముంచెత్తుతాయి. వరద నీటిమట్టం ఎన్ని అడుగులకు చేరుకుంటే ఏయే ప్రాంతాలు ముంపునకు గురవుతాయి? ఏయే గ్రామాల ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించాలి? పంట చేలు ఏ మేరకు దెబ్బతింటాయి? తదితర వివరాలు, ముందస్తు జాగ్రత్తలను పొందుపరుస్తూ 1984లో తొలిసారిగా ఫ్లడ్ మ్యానువల్ రూపొందించారు. దీని ప్రకారం అధికారులు ముంపు ప్రాంతవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తుంటారు. కాగా 1986 ఆగస్టు 16న గోదావరి వరద అత్యధికంగా 75.6 అడుగులుగా నమోదయింది. దీంతో 1987లో, అనంతరం 2007లో మరోసారి ఫ్లడ్ మ్యానువల్‌లో మార్పులు చేశారు. అదే మ్యానువల్‌ను అధికారులు ఇప్పటికీ మార్గదర్శనిగా ఉపయోగిస్తున్నారు.

పోలవరం నిర్మాణంతో పెరుగుతున్న ముంపు

ఏపీలో గోదావరి నదిపై పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టిన నేపథ్యంలో వరద ముంపు తీవ్రత అధికమవుతోంది. వరద నుంచి రక్షణకు నిర్మించిన కరకట్టకు ఇవతలి వైపున ఉన్న దుమ్ముగూడెం, చర్ల, భద్రాచలంలో వరద ముంపు పెరిగింది. నదికి అవతలివైపు ఉన్న బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు మండలాల్లో పొలాలు నీట మునుగుతున్నాయి. 2022 జూలై 16న గోదావరి మరోసారి ఉగ్రరూపం దాల్చగా, వరద 71.6 అడుగులుగా నమోదయింది. వేలాది ఎకరాల పంటలు నీటి మునిగాయి. వందలాది మంది నిరాశ్రయులయ్యారు. తొలిసారిగా బూర్గంపాడు, పాల్వంచ, అశ్వాపురం, మణుగూరు, దుమ్ముగూడెం మండలాల్లో ముంపు తీవ్రత అధికమైంది. పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్‌వాటర్ వల్లే ముంపు తీవ్రత పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. 2022 నుంచి మొదటి, రెండో ప్రమాద హెచ్చరికల స్థాయిలో స్థిరమైన వరద ప్రవాహం కొద్ది రోజులపాటు కొనసాగుతుండటం ప్రమాద ఘంటికలను మోగిస్తోంది.

ఆధునికీకరణ తప్పనిసరి

1987లో రూపొందించిన ఫ్లడ్ మ్యానువల్‌ను ఆధునికీకరించాలని ముంపు ప్రాంత ప్రజలు కోరుతున్నారు. 2022 వరదల నుంచి మరింతగా డిమాండ్ చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధుల్లో చలనం లేదు. వరదలు సంభవించిన సమయంలో హడావుడి చేస్తూ ఆ తర్వాత పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా ఇంజనీరింగ్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, దేవస్థాన తదితర శాఖల అధికారులు ఉమ్మడిగా కసరత్తు చేసి ఫ్లడ్ మ్యానువల్‌ను రూపొందించాల్సి ఉంది. గతంలో వరదల సమయంలో పని చేసిన సీనియర్ అధికారులు, సిబ్బంది సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్ట్ వల్ల భద్రాచలం పరిసర ప్రాంతాల్లో నమోదయ్యే గోదావరి వరదల గరిష్ట స్థాయి అంచనాలతో పటిష్ట ప్రణాళిక రూపొందించాలి. దీనివల్ల వరద నష్టనివారణ చర్యలు పకడ్బందీగా చేపట్టే అవకాశం ఉంటుంది.

వరదలతో అప్రమత్తంగా ఉండాలి

- సాగర్‌లో మరమ్మతుల నేపథ్యంలో ఎన్నెస్పీ ఆయకట్టుకు గోదావరి జలాలు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): గోదావరి వరదల పట్ల అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజుతో కలిసి ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాది క్రితం భద్రాచలం ఏజెన్సీలో బ్రిడ్జిలు ధ్వంసమైతే ఇప్పటివరకు ఎందుకు మరమ్మతులు చేపట్టలేదని అధికారులను ప్రశ్నించారు. పనులు చేపట్టకపోవడంతో వరదల వల్ల రాకపోకలు నిలిచిపోతున్నాయని పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య బాధ్యత పూర్తిగా పంచాయతీరాజ్ శాఖదేనని స్పష్టం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. గోదావరికి వరదలు పెరిగితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. నాగార్జున సాగర్‌లో మరమ్మతులు ఉండటంతో వైరా, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి మండలాల్లోని సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు తరలిస్తున్నట్లు తెలిపారు. సాగర్ కెనాల్‌కు రెండు రోజుల్లో నీరు చేరుతుందని అన్నారు. రాబోయే సీజన్ వరకు ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, వైరా నియోజకవర్గాలు, జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 1.50 లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తామని తెలిపారు. జిల్లాలోని పినపాక, అశ్వారావుపేట, భద్రాచలం, కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాలకు 25 వేల నుంచి 50 వేల ఎకరాల వరకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఈ సమావేశంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ విద్యాచందన, ఇతర అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్, బాబూరావు, వెంకటేశ్వరరావు, జయలక్ష్మి, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

నెమ్మదిస్తున్న గోదావరి



భద్రాచలం వద్ద గోదావరిలో వరద ఉధృతి

భద్రాచలం వద్ద 41.5 అడుగులకు పెరిగి తగ్గుతున్న వరద

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరిలో వరద ప్రవాహం శనివారం సాయంత్రం నుంచి నెమ్మదించింది. ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి వరద నీరు భారీగా వస్తుండటంతో రెండు రోజులుగా నదిలో వరద ఉధృతి పెరిగింది. వరద నీటిమట్టం శుక్రవారం రాత్రి 11 గంటలకు 38.8 అడుగులకు చేరింది. శనివారం ఉదయం 40.5 అడుగులకు, క్రమంగా మధ్యాహ్నం వరకు 41.5 అడుగులకు పెరిగింది. అనంతరం తగ్గుముఖం పట్టింది. రాత్రి 9 గంటలకు 40 అడుగులకు తగ్గింది. ఎగువన ఉన్న ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో తగ్గుతుండటంతో క్రమంగా గోదావరి వరద కూడా తగ్గుతోందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. వరద ఉధృతితో రహదారులు మునిగి భద్రాచలం దిగువన ఉన్న ఏపీలోని విలీన మండలాల్లో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. గోదావరి నదిలో వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో జిల్లా అధికారులు, ముంపు గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



సున్నంబట్టి రహదారిపైకి చేరిన వరద నీరు

దుమ్ముగూడెంలో నిలకడగా..

దుమ్ముగూడెం: ఎగువ ప్రాంతాల నుంచి వరద నెమ్మదించడంతో శనివారం మండలంలో గోదావరిలో వరద ప్రవాహం నిలకడగా ఉంది. పర్ణశాల నారచీరల ప్రాంతం వరద నీటిలోనే మునిగి ఉండగా, సున్నంబట్టి–బైరాగులపాడు గ్రామాల మధ్య రహదారి పైకి వరద నీరు చేరింది.

‘సీతారామ’ జలాలు విడుదల

మోటారు స్విచాన్ చేసిన పినపాక ఎమ్మెల్యే పాయం



విడుదలవుతున్న గోదావరి జలాలు



బీజీ కొత్తూరు పంప్‌హౌస్ నుంచి నీరు విడుదల చేస్తున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

అశ్వాపురం: మండల పరిధిలోని బీజీ కొత్తూరులో ఉన్న సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నారు. ఒక మోటారు ద్వారా శనివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్విచ్ ఆన్‌చేసి విడుదల చేశారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ ఆయకట్టులో తీవ్ర నీటి సమస్య నెలకొని నారుమడులు ఎండిపోతున్నాయి. ఈ సమస్యను రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో అధికారులు 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరిలో 8లక్షల క్యూసెక్కుల జలాలు డిశ్చార్జ్ అవుతున్నాయని, ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చే వరకు పంప్‌హౌస్ నుంచి నీరు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. కాగా గోదావరి జలాలు ఇక్కడి నుంచి ఏన్కూరు లింక్ కెనాల్(రాజీవ్ కెనాల్) ద్వారా ఎస్ఎస్పీ కెనాల్‌కు తరలనున్నాయి. నీటిపారుదల శాఖ ఎస్ఈ రవికుమార్, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాస్, ఏఈ రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, ఓరుగంటి రమేష్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రేపు తాలిపేరు నీటి విడుదల

చర్ల: తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు నుంచి ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు సోమవారం నుంచి సాగునీరు విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ఈఈ సయ్యద్ అహ్మద్ జానీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు నీటిని విడుదల చేస్తారని పేర్కొన్నారు.

రైతులకు ‘యూరియా’ వెతలు

- కొరత, అంతకుమించి ప్రచారంతో ఆందోళన చెందుతున్న కర్షకులు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రకటనలతో మరింత అయోమయం
- పీఏసీఎస్ గోదాంల వద్ద బారులుదీరుతున్న రైతులు
- జిల్లాకు సరిపడా కోటా వచ్చిందంటున్న వ్యవసాయాధికారులు



ఈ నెల 3న గుండాల పీఏసీఎస్ ఎదుట యూరియా కోసం బారులుదీరిన రైతులు

బూర్గంపాడు: పంటల సాగు ప్రారంభంలోనే యూరియా కొరతతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వ్యవసాయ పనులు మానుకుని పీఏసీఎస్ గోదాంల వద్ద బారులుదీరుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రకటనలతో అయోమయం చెందుతున్నారు. యూరియా కోటా పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిసి విన్నవించారు. ఆ మరునాడే తెలంగాణలో రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించాలని, సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయాలని నడ్డా సూచించడంతో యూరియా కొరత నిజమేననే నిర్ధారణకు రైతులు వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ డీలర్లకు యూరియా సరఫరాను బాగా తగ్గించేడంతో పీఏసీఎస్ గోదాంల వద్ద క్యూ కడుతున్నారు.

సాగు పనులు ఊపందుకోవడంతో..

జిల్లాలో ఇప్పటికే 90 శాతం మేర పత్తి విత్తనాలు నాటారు. వరినాట్లు ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. సాగు పనులు ఊపందుకోవటంతో రైతులు ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. యూరియా సరఫరా కూడా జిల్లాకు రావాల్సిన కోటాకు తక్కువగా వస్తుండటంతో రైతులు కలవరపడుతున్నారు. రసాయనిక ఎరువుల్లో తక్కువ ధరకు లభిస్తుండటంతో రైతులు యూరియా వినియోగాన్ని బాగా పెంచారు. యూరియా వినియోగంతో పంటలకు చీడపీడలు ఎక్కువగా ఆశిస్తాయని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నా రైతులు పెట్టుబడి వ్యయం దృష్టిలో ఉంచుకుని యూరియానే ఎక్కువగా వినియోగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ రాయితీపోను 45 కిలోల యూరియా బస్తా రూ.267కు దొరుకుతుంది. అదే కాంప్లెక్స్ ఎరువులైన డీఏపీ, 20:20:0:13లు బస్తా రూ.1400కు చేరింది. మిగతా కాంప్లెక్స్ ఎరువుల ధరలు బస్తా రూ.1,750 నుంచి రూ.1800 వరకు ఉన్నాయి. కాంప్లెక్స్ ఎరువులకు ఎక్కువ ధరలు పెట్టలేక యూరియా వినియోగిస్తున్నారు. జూన్, జూలై నెలలకు కలిపి జిల్లాకు 16 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఆ మేరకు సరఫరా అయిందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే కోటా సరిపడా వస్తే రైతులు గోదాంల వద్ద ఎందుకు బారులుదీరుతున్నారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఏప్రిల్, మే నెలల్లో రావాల్సిన కోటా రాలేదని, అప్పుడు వినియోగించుకోవాల్సిన రైతులు జూన్ మొదటివారంలో వినియోగించుకున్నారని, ఈ క్రమంలో కొరత ఏర్పడిందని పలువురు పేర్కొంటున్నారు.

గోదాంల వద్ద బారులు

యూరియా కోసం రైతులు ఒకేసారి అధిక సంఖ్యలో వస్తుండటంతో పీఏసీఎస్ ఎరువుల గోదాంల వద్ద గొడవలు జరుగుతున్నాయి. పీఏసీఎస్‌లకు వస్తున్న రెండు, మూడు లారీల కోసం వందలాదిమంది క్యూ కడుతున్నారు. వీరిలో సగం మందికి కూడా యూరియా అందడంలేదు. దీంతో విక్రయాలు పీఏసీఎస్ సిబ్బందికి తలనొప్పిగా మారాయి. దీంతో ఆధార్‌కార్డ్‌కు ఒకట్రెండు యూరియా బస్తాలు ఇవ్వటం ప్రారంభించారు. పంటలు సాగు చేయని వారి ఆధార్‌కార్డులు కూడా వస్తుండటంతో యూరియా ఎటూ సరిపోవటం లేదు. ఈ నేపథ్యంలో మూడురోజులుగా పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్‌కార్డుల జిరాక్స్‌లు ఆధారంగా ఎకరాకు ఒక యూరియా బస్తా ఇస్తున్నారు. జూలై, ఆగస్టు నెలల్లో పంటలకు ఎరువుల వినియోగం మరింతగా పెరగనుంది. ఈ పరిస్థితుల్లో యూరియా సరిపడా అందుబాటులోకి వస్తుందా లేదా అనేది వేచిచూడాలి. జిల్లా వ్యవసాయశాఖ అధికారులు మాత్రం యూరియా కొరత ఉండదని, రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించుకోవాలని సూచిస్తున్నారు.

యూరియా దొరకటం లేదు



ఐదెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. తొలివిడత ఎరువు వేద్దామంటే యూరియా దొరకటం లేదు. మూడురోజులుగా పీఏసీఎస్ గోదాంకు తిరుగుతున్న ఎకరాకు బస్తా ఇస్తున్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు అడుగుతున్నారు.

– సాంబశివరావు, రైతు, పెద్దతోగు, గుండాల మండలం

వేచి చూస్తున్నాం..



ఈ ఏడాది యూరియాకి ఇబ్బందిగానే ఉంది. ఒక రోజు వెళ్లి ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్ ఇచ్చి రావాలి. లోడ్ వచ్చిన రోజు వెళ్లి సీరియల్ కోసం వేచిచూడాలి. ఈలోపు వచ్చినా యూరియా అయిపోతే మళ్లీ లోడ్ వచ్చేవరకు ఎదురుచూడాలి.

– నిమ్మల రాములు, రైతు, నాగినేనిప్రోలు, బూర్గంపాడు మండలం

ఆకట్టుకుంటున్న జలపాతం

వెన్నెల జలపాతం పర్యాటకులకు ఆహ్లాదం పంచుతోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొండపై నుంచి జాలువారుతూ.. సహజసిద్ధ అందాలతో సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తోంది. మణుగూరు మండలంలోని అభయాంజనేయస్వామి ఆలయ సమీపంలోని రథంగుట్ట అర్బన్ పార్క్‌లో ఉన్న జలపాతానికి సందర్శకుల తాకిడి పెరిగింది. పిల్లలు, పెద్దలు వచ్చి స్నానాలు చేస్తూ సరదాగా గడుపుతున్నారు. జలపాతం వద్ద స్విమ్మింగ్ పూల్ సైతం ఏర్పాటు చేశారు. పరిసరాల్లో బల్లలు ఏర్పాటు చేయాలని, రహదారి, కుటీరాలను మెరుగుపర్చాలని సందర్శకులు కోరుతున్నారు. – మణుగూరు రూరల్



సందడి చేస్తున్న పర్యాటకులు



వెన్నెల జలపాతం

క్లుప్తంగా

ఆర్టీసీ దుకాణదారులకు జరిమానా



ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకురాలికి జరిమానా రశీదు ఇస్తున్న విజయశ్రీ

అశ్వారావుపేటరూరల్: ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని పలువురు వ్యాపారులు, దుకాణాదారులకు సత్తుపల్లి ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ జరిమానా విధించారు. శనివారం ఆమె అశ్వారావుపేట ఆర్టీసీ బస్టాండ్‌తోపాటు సైకిల్‌స్టాండ్, పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సైకిల్ స్టాండ్ నిర్వాహకుడు వినియోగదారుల వద్ద నుంచి నిబంధనలకు విరుద్ధంగా అధికగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుతో రూ.1000 జరిమానా విధించారు. బస్టాండ్‌లోని మరుగుదొడ్లను తనిఖీ చేసి అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి నిర్వాహకురాలికి రూ.1000, ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌కు ఆర్టీసీ కేటాయించిన స్థలం కంటే అధికంగా ఆక్రమించినట్లు గుర్తించి బాధ్యురాలికి రూ.1000 చొప్పున జరిమానా విధించి రశీదులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆర్టీసీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీసీపీ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారిపై కుక్కల దాడి



కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి

బూర్గంపాడు: బూర్గంపాడులోని గౌతమీపురంలో ఓ చిన్నారిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. గౌతమీపురానికి చెందిన మందా ప్రవీణ్ కుమార్తె యసిక శని వారం ఇంటి బయట ఆడుకుంటుండగా ఒక్కసారిగా కుక్కలు దాడికి పాల్పడ్డాయి. ఆ చిన్నారి మెడను కొరికేందుకు కుక్కలు ప్రయత్నిస్తుండగా స్థానికులు రాళ్లు విసరటంతో ఆమె ముఖాన్ని కరిచాయి. తీవ్రంగా గాయపడిన చిన్నారిని కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

సోదాల పేరుతో దౌర్జన్యం చేశారని ఫిర్యాదు

పాల్వంచరూరల్: సివిల్ దుస్తుల్లో వచ్చిన ఇద్దరు పోలీసులు సోదాల పేరుతో దౌర్జన్యం చేశారని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని కిన్నెరసానిలోని పెద్ద బోయిన వెంకటనర్సమ్మ దుకాణం వద్దకు శుక్రవారం సివిల్ దుస్తుల్లో ప్రసాద్, నరేశ్ వచ్చి.. గంజాయి విక్రయిస్తున్నావంటూ దుర్భాషలాడారు. ఆమె కుమారుడిని తనిఖీ చేశారు. మహిళ అని చూడకుండా తనను బలవంతంగా నెట్టివేశారని శనివారం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై ఎస్‌ఐ సురేశ్‌ను వివరణ కోరగా మహిళ ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమేనని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పేకాట స్థావరంపై దాడి

అశ్వాపురం: మండలంలోని మొండికుంట శివారులో సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ ప్రాంతంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకొని రూ.19 వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

కొండచిలువల సంచారం



మనుబోతులగూడెం ఫారెస్ట్ సెక్షన్‌లో కొండచిలువ

బూర్గంపాడు: అశ్వాపురం మండలంలోని మనుబోతులగూడెం ఫారెస్ట్ సెక్షన్‌లో కొండచిలువల సంచారం పెరిగింది. 250 ఎకరాల్లో ఇటీవల అటవీశాఖ అధికారులు ప్లాంటేషన్ చేపట్టారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నాగరాజు శనివారం ప్లాంటేషన్ నిర్వహణకు వెళ్తున్న క్రమంలో రెండుచోట్ల కొండచిలువలు (ఇండియన్ పైథాన్) కనిపించాయని తెలిపారు. అటవీ సంరక్షణ చర్యలతో కొన్ని జీవజాతులు మళ్లీ అడవుల్లో కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

కుక్క, కోతి దాడిలో నలుగురికి గాయాలు

ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురం, ముదిగొండ, యడవల్లిగ్రామాల్లో శనివారం కుక్క, కోతి చేసిన దాడిలో నలుగురికి గాయాలయ్యాయి. వీధిలో వెళుతున్న నఫీసా, మరో కూలీపై కుక్క దాడి చేయగా, మరో ఇద్దరిపై కోతులు దాడి చేశాయి. ఈమేరకు గాయపడిన వారికి ముదిగొండ పీహెచ్‌సీలో చికిత్స చేయించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

ఓసీ విస్తరణ వైపు అడుగులు

- రెండు గ్రామాల్లో భూసేకరణకు ప్రజామోదం
- కార్మికులు, అధికారుల్లో హర్షాతిరేకాలు
- 455.7 ఎకరాల భూమికి లైన్ క్లియర్



కొమ్ముగూడెంలో అంగీకారం తెలుపుతున్న ప్రజలు



మణుగూరు ఓసీ వ్యూ పాయింట్

మణుగూరుటౌన్: పెరుగుతున్న విద్యుత్ అవసరాలు, బొగ్గు వినియోగం, ప్రత్యక్ష, పరోక్షంగా ఆధారపడిన కంపెనీలు, స్థానికంగా ఉపాధి పొందుతున్న వందలాది కుటుంబాలు మణుగూరు ఓసీ విస్తరణ కోసం ఎదురుచూస్తున్నాయి. ప్రతిపాదిత గ్రామాలైన మణుగూరు, తిర్లాపురం, రామానుజవరంలో రెండు గ్రామాల ప్రజలు భూసేకరణకు గ్రామసభల్లో ఆమోదం తెలపారు. దీంతో సింగరేణి మణుగూరు ఓసీ విస్తరణపై ఇటు అధికారులు, అటు కార్మికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ఏరియా ఓసీ–2, ఓసీ–4, మణుగూరు ఓసీ, కొండాపురం అండర్ గ్రౌండ్ మైన్ గనుల నుంచి ఏటా వందల టన్నుల బొగ్గును అందిస్తూ రాష్ట్ర, దేశ అభివృద్ధిలో తనవంతుగా మణుగూరు ఏరియా భాగస్వామ్యం అవుతోంది. ఈ నేపథ్యంలో మణుగూరు ఓసీ బొగ్గు నిల్వలు అడుగంటుతుండటం మరో ఆరు నెలల్లో గని మూతపడే పరిస్థితికి రావడంతో ఓసీ విస్తరణ అనివార్యమైంది. ఈ నేపథ్యంలో (దాదాపు ఏడాదిన్నర సమయం అనంతరం) గ్రామస్తులు భూసేకరకు ఆమోదం తెలిపడంతో సింగరేణి అధికారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మరో 20 ఏళ్లు మణుగూరులో తమ ప్రస్థానం కొనసాగిస్తూ సమీప గ్రామాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటునందించే అవకాశం లభిస్తుందని తమ కృషికి తగిన ఫలితం దక్కుతోందని అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

2024లో నిర్ణయం

మణుగూరు ఓసీ విస్తరణకు భూ సేకరణ జరపాలని 2024 ఫిబ్రవరి 7వ తేదీన సింగరేణి అధికారులు ప్రభుత్వానికి తెలుపారు. అందుకుగాను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుమను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నాటి నుంచి నేటి వరకు ప్రతిపాదిత మణుగూరు మున్సిపాలిటీలోని కొమ్ముగూడె, తిర్లాపురం, రామానుజవరం గ్రామాల్లో 813 ఎకరాల భూ సేకరణకు ఒక్కోచోట మూడు సార్లు గ్రామసభలు నిర్వహించినా, క్షేత్రస్థాయిలో పర్యటించి నచ్చజెప్పినా ఫలితం లభించలేదు. శాశ్వత ఉపాధి కావాల్సిందేనంటూ పట్టుబట్టారు. అధికారులు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, ఓసీ విస్తరణలో ఏర్పడే అవకాశాలు నిర్వాసితులకే అవసరమైతే శిక్షణ కూడా ఇచ్చేందుకు భరోసా కల్పించారు.

ఎకరానికి రూ.22.50 లక్షల పరిహారం..

తాజాగా మణుగూరు పట్టణంలోని కొమ్ముగూడెం, తిర్లాపురం గ్రామాల్లో ప్రజామోదం లభించడం పట్ల సింహభాగం పూర్తయినట్లు అధికారులు భావిస్తున్నారు. సేకరించనున్న 813 ఎకరాల భూ సేకరణలో రెండు గ్రామాల రైతులు సుముఖత వ్యక్తం చేయడంతో 455.7ఎకరాలకు గ్రామస్తులు ఆమోదం తెలిపినట్లయింది. సింగరేణి పూర్తిగా వ్యవసాయ భూమి సేకరణపైనే దృష్టి సారించగా, నివాసాలు ఎవరూ కోల్పోవడం లేదు. ఏజెన్సీ చట్టాలను అనుసరించి గిరిజనులకు ఎకరాకు 22.50 లక్షలు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.5.50 లక్షలు, పొలంలోని, మోటార్లు, చెట్లు, ఇతర పనిముట్లకు విలువ కట్టి అదనంగా ఇచ్చేందుకు నిర్ణయించారు. గిరిజనేతరులకు, పట్టాలేని వారికి ఎకరాకు రూ.11.2.5 లక్షలు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, ఇతర ప్రయోజనాలు అందించనున్నారు. పెద్ద చెరువు, రాయుగటకుంట, చింతకుంట, బుర్దన్‌వాయ్ కుంట, మల్లంపాడు చెరువుల అభివృద్ధికి రూ.17.45 కోట్లు కేటాయించారు. ఆయా చెరువులపై ఆధారపడిన, రిజిస్టర్ అయిన సొసైటీలో సభ్యత్వం ఉండి ఉపాధి కోల్పోయే వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందించేందుకు నిర్ణయించారు. ప్రాజెక్ట్ మొత్తం 300 కుటుంబాలు ఉండగా, 500 మంది పీఏఎఫ్ (ప్రాజెక్ట్ ప్రభావిత వ్యక్తులు) ఉన్నట్లు ప్రాథమిక అంచనా.

విస్తరణ వివరాలు..

- భూములు సేకరించే గ్రామాలు: రామానుజవరం, తిర్లాపురం, మణుగూరు
- కోల్పోతున్న పెద్ద చెరువులు: రాయలకుంట, చింతకుంట, బుర్దన్‌వాయ్‌కుంట, మల్లంపాడు.

ప్రతిపాదిత సేకరణ భూమి..

తిర్లాపురం	359.34 ఎకరాలు
రామానుజవరం	356.16 ఎకరాలు
మణుగూరు కొమ్ముగూడెం	96.36 ఎకరాలు
అటవీ భూమి	58.51 హెక్టార్లు
మొత్తం	813 ఎకరాలు

సర్వే సమయంలో స్థానికంగా ఉండాలి



మణుగూరు ఓసీ విస్తరణలో అందించే పరిహారం విని గ్రామస్తులు ఆమోదం తెలిపారు. సర్వే జరిగే సమయంలో అన్ని పనులు పక్కన పెట్టి క్షేత్రస్థాయిలో ఉండాలి. అవార్డులో తప్పులకు తావివ్వకుండా సర్వే సజావుగా జరిగే అవకాశం ఉంటుంది. ఫలితంగా నిర్వాసితులకు నేరుగా ఖాతాలో డబ్బులు జమ అవుతాయి. దళారులను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడొద్దు.

–సుమ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

బోడ కాకర@రూ.400



పాల్వంచలో కూరగాయల దుకాణం

ఈ సీజన్‌లో లభించే బోడ కాకరకాయల ధర వింటేనే వినియోగదారులు అమ్మో.. అంటున్నారు. రుచికరమైన, పోషకాలున్న బోడ కాకరకాయలు తినడానికి చాలామంది ఇష్టపడుతుంటారు. కానీ సామాన్యులు కొనలేనంతగా కేజీ రూ.400 విక్రయిస్తున్నారు. పాల్వంచ ప్రాంతంలోని కూరగాయల వ్యాపారులు ఏపీ రాష్ట్రంలోని తణుకు, అరకు ప్రాంతాల నుంచి బోడ కాకరకాయలను దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు.

– పాల్వంచరూరల్

జామాయిల్ చిగుర్ల చోరీపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

ములకలపల్లి: జామాయిల్ మొక్కల చిగుర్ల చోరీపై టీఎస్ఎఫ్‌డీసీ అధికారులు విచారణ చేపట్టారు. మండలంలోని జిన్నెలగూడెం ప్లాంటేషన్ పరిధిలోని సుమారు 50 హెక్టార్లలో తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో పెంచుతున్న జామాయిల్ తోటల్లోని చిగుర్ల చోరీపై శనివారం 'జామాయిల్ మొక్కల చిగుర్లు చోరీ?'శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్లాంటేషన్ మేనేజర్ (పీఎం) సునీత క్షేత్రస్థాయిలో పర్యటించి, వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో మాట్లాడుతూ.. చిగుర్ల చోరీలో తమశాఖ సిబ్బంది ప్రమేయం లేదని తెలిపారు. సమగ్ర విచారణ చేపడుతున్నామని, ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని వెల్లడించారు.



నారుకు రక్షణగా కట్టిన పాత చీరలు

ఖర్చు పెట్టుకోలేక..

గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వరి నారును జీవాల నుంచి కాపాడుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. కొందరు నారు చుట్టూ రక్షణగా కంచెలు, పరదాలు, వలలు, గ్రీన్‌షీట్‌లను ఏర్పాటు చేస్తుంటారు. ఇవి కొంతమేర ఖర్చుతో కూడుకున్నవి. కానీ, రూపాయి ఖర్చు లేకుండా అశ్వారావుపేట మండలం మొద్దులమడ గ్రామంలో ఓ గిరిజన రైతు ఇంట్లో వాడి వృథాగా పడేసిన పాత చీరలను కంచెకు కట్టి వరి నారుకు రక్షణగా ఏర్పాటు చేశాడు. ఈ దృశ్యాన్ని శనివారం 'సాక్షి'కెమెరా క్లిక్ మనిపించింది.

–అశ్వారావుపేటరూరల్

ఎక్కడికక్కడే సేకరణ.. అమ్మకం



ఖమ్మంలోని విజయ డెయిరీ కార్యాలయం

- విజయ డెయిరీ అధికారుల కార్యాచరణ
- పట్టణాల్లో ఇంకొన్ని పార్లర్ల ఏర్పాటుకు చర్యలు
- ఏజెంట్లను మరింతగా ప్రోత్సహించాలని నిర్ణయం



ఖమ్మం యూనిట్‌లో పాలు ప్యాకింగ్ చేస్తున్న సిబ్బంది



విజయ పాలు

ఖమ్మంవ్యవసాయం: పాల ప్రాధాన్యత పెరిగిన నేపథ్యాన సేకరణ, విక్రయాలు మరింత పెంచాలని రాష్ట్ర పాడి పరిశ్రమ(విజయ డెయిరీ) నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని యూనిట్ల వారీగా సేకరించిన పాలను ఆయా యూనిట్ల పరిధిలోనే ఏ రోజుకు ఆ రోజు విక్రయించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇదే సమయాన పాల ఉత్పత్తుల వ్యాపారంపైనా దృష్టి సారించాలని ఆ ఆదేశాల్లో అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుతం యూనిట్లలో సేకరించే పాలలో తక్కువ శాతం స్థానికంగా విక్రయిస్తూ మిగిలిన పాలను రాష్ట్ర పాడి పరిశ్రమకు చేరవేస్తున్నారు. అక్కడ పాలను పొడిగానే కాక ఇతర ఉత్పత్తులుగా మార్చి రాష్ట్రంతో పాటు పొరుగు రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. ఈక్రమంలో ఖర్చు పెరుగుతుండడమే కాక వ్యాపారం మందగించినప్పుడు పాల ఉత్పత్తులు పేరుకుపోతున్నాయి. ఈ అంశంపై సమీక్షించిన అధికారులు ప్రైవేట్ సంస్థల మాదిరిగానే ఎక్కడ సేకరించిన పాలను అక్కడే విక్రయించాలనే నిర్ణయానికి వచ్చారు. 'విజయ' డెయిరీ పాలకు ఆదరణ ఉన్నప్పటికీ అందుబాటులో లేక వ్యాపారం తగ్గుతుందనే భావనతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

6వేల లీటర్ల సేకరణ

ఖమ్మంలోని ప్రభుత్వ పాడి పరిశ్రమ(విజయ డెయిరీ) యూనిట్ ద్వారా ఉమ్మడి జిల్లాలోని 30మండలాల్లో 227 గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటుచేశారు. వీటి ద్వారా 3,025 మంది పాడి రైతుల నుంచి నిత్యం 6వేల లీటర్ల పాలు సేకరిస్తున్నారు. కామేపల్లి, మధిర, ఎర్రుపాలెం, కల్లూరు, సత్తుపల్లి, ఇల్లెందు, కొత్తగూడెంలోని పాల శీతలీకరణ కేంద్రాల ద్వారా ఈ ప్రక్రియ జరుగుతోంది. ఖమ్మంలోని రోటరీనగర్‌లో 25వేల లీటర్ల సామర్థ్యంతో యూనిట్ ఉన్నా అందుకు అనుగుణంగా పాల సేకరణ జరగడం లేదు. సీజన్‌లో 15వేల లీటర్ల పైగా, మిగతా సమయాల్లో ఆరు వేల లీటర్లు దాటడం లేదు.

స్థానికంగా వ్యాపారంపై ప్రణాళిక

ఉమ్మడి జిల్లాలో సేకరించే పాలను స్థానికంగానే విక్రయించేలా ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం 6వేల లీటర్ల మేర పాలు సేకరిస్తుండగా రెండు వేల లీటర్లే ఇక్కడ విక్రయిస్తున్నారు. ఇందులో 1,500 లీటర్లు ప్రైవేట్ మార్కెట్ ద్వారా, 500 లీటర్ల పాలను ప్రభుత్వ హాస్టళ్లకు సరఫరా చేస్తున్నారు. మిగిలిన పాలను హైదరాబాద్ రాష్ట్ర పాడి పరిశ్రమకు పంపిస్తున్నారు. అయితే, ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాలు ఉన్నందున అన్నింటికీ విజయ పాలు సరఫరా చేసేలా నిర్ణయించి, భద్రాచలం ఐటీడీఏ పీఓను డెయిరీ పాడి పరిశ్రమ అధికారులు కలిశారు. అన్నీ కలిసొస్తే త్వరలోనే ఇక్కడే విజయ డెయిరీ పాల విక్రయం పెరగనుంది.

మరిన్ని పార్లర్లు, ఏజెంట్లకు ప్రోత్సాహం

విజయ పాలకు ఉన్న డిమాండ్ ఆధారంగా ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో పార్లర్లు ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఖమ్మంతో పాటు జిల్లాలో కేవలం ఐదు పార్లర్లే కొనసాగుతున్నాయి. విజయ పాలు, పాల ఉత్పత్తులకు డిమాండ్ ఉన్నప్పటికీ లభ్యత లేక ప్రజలు ప్రైవేట్ డెయిరీలపై ఆధారపడుతున్నారు. ఈనేపథ్యాన పార్లర్లు కనీసం మరో 15 ఏర్పాటుచేయడం ద్వారా విక్రయాలు మరింత పెరుగుతాయని చెబుతున్నారు. ఖమ్మంతో పాటు మధిర, వైరా, సత్తుపల్లి, ఖమ్మం రూరల్, ఇల్లెందు, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, అశ్వాపురం, భద్రాచలం, కోదాడ, సూర్యాపేటల్లో కూడా పార్లర్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు. ఇదే సమాయన ఏజెంట్లను ప్రోత్సహించాలనే భావనకు వచ్చారు. సంస్థ లీటర్ పాలపై డిస్ట్రిబ్యూటర్లకు రూ.5 చొప్పున కమీషన్ ఇస్తుంది. అక్కడి నుంచి ఏజెంట్లకు సరఫరా చేస్తారు. ఈనేపథ్యాన ఏజెంట్లను మరింతగా పెంచడం ద్వారా వ్యాపారం పెంపొందించేలా కసరత్తు మొదలుపెట్టారు.

పాల సేకరణ పెంపునకు కృషి



ఉమ్మడి జిల్లాలో పాల విక్రయానికి వనరులు ఉన్నాయి. ప్రస్తుతం సేకరిస్తున్న పాలలో మూడో వంతే ఇక్కడ విక్రయిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలతో మొత్తం పాలను స్థానికంగా విక్రయానికి ప్రణాళిక రూపొందించారు. ఇదే సమయాన పాల సేకరణను 20 వేల లీటర్లకు పెంచేలా కృషి చేస్తున్నాం.

– కె.రవికుమార్, విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్, ఖమ్మం

అట్రాసిటీ కేసుపై విచారణ



బాధితురాలితో మాట్లాడుతున్న ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను

జూలూరుపాడు: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విషయంలో తనకు న్యాయం చేయాలని కోరుతూ జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామానికి చెందిన గిరిజన మహిళ రజనీ జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. శనివారం విచారణ అధికారి, ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను వెంగన్నపాలెంలోని బాధితురాలు రజనీ ఇంటికి వెళ్లి విచారించారు. ఈ విషయంపై డీఎస్పీ చంద్రభానును వివరణ కోరగా అట్రాసిటీ కేసు విచారణ నిమిత్తం వచ్చామని, బాధితురాలు, సాక్షుల నుంచి వివరాలు సేకరించామని, సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అశ్వాపురం: మండలంలోని మొండికుంట శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పాల్వంచ మండలం పాండురంగాపురం గ్రామానికి చెందిన గంగిరెడ్డి వెంకటరెడ్డి(67) తన కారులో డ్రైవింగ్ చేసుకుంటూ పాల్వంచ వెళ్తున్నాడు. మొండికుంట శివారు మణుగూరు – కొత్తగూడెం ప్రధాన రహదారిపై ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి చెట్టును ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటరెడ్డిని 108 వాహనంలో భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. సీఐ అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: ఇద్దరు వ్యక్తులు తనపై దాడి చేశారని ఓ మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని బస్వతారకకాలనీలో ఓ దుకాణం వద్దకు శుక్రవారం సోములగూడెంనకు చెందిన గొప్పిశెట్టి దుర్గ, లక్ష్మీదేవిపల్లికి చెందిన భూక్యా సాగర్ వెళ్లి మద్యం కావాలని అడిగారు. డబ్బులు ఇస్తే మద్యం ఇస్తామని చెప్పడంతో వాగ్వాదానికి దిగి.. ఇద్దరూ తన భర్త సంపత్‌రెడ్డి, తనపై దాడి చేశారని చెల్లా నీరజ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ హరి తెలిపారు.

కాంగ్రెస్ హయాంలో సుపరిపాలన

- పాల్వంచలో మరో పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తాం
- రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి



కేటీపీఎస్‌లో కలెక్టర్ పాటిల్, అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీ రేణుకాచౌదరి

సూపర్‌బజార్(కొత్తగూడెం)/పాల్వంచ/సుజాతనగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యాన సుపరిపాలన సాగుతోందని రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి తెలిపారు. కొత్తగూడెం క్లబ్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి ఆమె కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశాక మాట్లాడారు. కాగా, సింగరేణిలో అవకతవకలపై విచారణ చేయిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. 167 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 165 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశామని తెలిపారు. అనంతరం పాల్వంచలో తొలగించిన కేటీపీఎస్ ఓఅండ్ఎం (పాత ప్లాంట్) కర్మాగారాన్ని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్‌తో కలిసి సందర్శించిన ఎంపీ రేణుకాచౌదరి కేటీపీఎస్ సీఈ శ్రీనివాసబాబు, అధికారులతో మాట్లాడారు. పాల్వంచలో మరో విద్యుత్ కర్మాగారాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఎన్ఎండీసీ విస్తరణపైనా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఎస్ఈ యుగపతి, కొత్తగూడెం ఆర్డీఓ మధు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, సొసైటీల చైర్మన్లు మండే వీరహన్మంతరావు, కొత్వాల శ్రీనివాసరావు, నాయకులు నాగా సీతారాములు, ఎస్కే సాబీర్‌పాషా, ఎడవల్లి కృష్ణ, మంగీలాల్, జలీల్, మాజిద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సుజాతనగర్‌కు చెందిన దివంగత సీపీఎం నేత కాసాని ఐలయ్య కుటుంబాన్ని ఎంపీ రేణుకాచౌదరి పరామర్శించారు.